మగని చెవిలో (సంసారం గురించి)

'అనసూయ'

చూశేరా! లోకంలో యేమీ లేందే యెలాగు పుట్టిస్తారో! మోనిరుడు శివరావు అను బ్యాంకు సూపరువైజరు పోయేడుగదూ! అతడియిల్లు మనకు చేరువ మూరెడు మేర. ఆతని భార్య రమణమ్మ రోజూ నాదగ్గరకు వస్తూఉండేది. రోజూ నేనూ దానిదగ్గరకు వెళుతూ ఉండేదానిని; అలాగు మాయిద్దరికీ స్నేహం కలిసిపోయింది. పాపము! దాని మొగుడికి వారం రోజులుమాత్రం జబ్బుచేసి పక్షి యెగిరిపోయినట్లు ఎగిరిపోయేడు. వాళ్లిద్దరూ ఎంతో అన్యోన్యంగా ఉండేవారు చిలుకా గోరెంకల్లాగు! చూస్తే ముచ్చట వేసేది. ఎప్పుడూ నవ్వుతాలేగాని విచారమన్నమాట వాళ్లవద్ద కనపడేది కాదు. హఠాత్తుగా పిడుగుపడ్డట్లు అతనికి మరణము సంభవించినది. రమణమ్మగోల భూమీ ఆకాశమూ పట్టలేదుగదా! తరువాత అది పుట్టింటికి వెళ్లిపోయింది. అచ్చట అది తోటలలోనూ దొడ్లలోనూ షోకుగా షికారువెళుతూ ఉన్నదనీ, చీర రవికె కట్టుకొని సోపుల్లూ పౌడర్లూ రాసుకొని ముస్తాబుగా తిరుగుతూ ఉంటుందనీ, విధవావివాహం చేసుకోడానికి ప్రయత్నం చేస్తూ ఉన్నదనీ ఈమోస్తరుగా యిచ్చట బుకార్లు బుట్టించేరు! పుట్టించినవాళ్లు ఏపాపాన్ని పోతారోగాని అదంతా అబద్ధమేసుమండీ! ఇవి కిట్టక పనిలేని ఆడవాళ్లు కల్పించిన బుకార్లుగాని మరేమీ కావు. మొన్ననువచ్చి ఇచ్చట వాళ్లఅత్తగారింట నాలుగు రోజులు ఉన్నది. అప్పుడు దానిని చూచినానుగదా! నిత్యమూ కంటికీనేలకూ ఏకధారగా, ఏడవడముతప్ప దానికి మరొక పనేలేదు! తనభర్తను తల్చుకోని నిమిషంలేదు! ఇంటిలోని ప్రతివస్తువును చూడడం, అతనిని జ్ఞాపకం తెచ్చుకోవడం, వాళ్ల పూర్వపు రోజులు స్మరించడం, కళ్లంట నీరుకార్చడం, యీమోస్తరుగా ఎప్పుడుచూచినా భర్తనుగురించే తలచుకొంటూ అన్యచింతలేని దాన్నిగురించి ఈఊరి అమ్మలక్కలు ముఖ్యంగా మీవాళ్లు, పుట్టించిన బుకార్లు వింటే ఎవరికైనా కోపంవస్తుందా రాదా?

అందులోకీ మీవాళ్లు ఉన్నారే, ఒక బుకారు పుట్టించడానికి అయితేనేమి, పుట్టినది నాల్గుమూలలా అల్లుకొనేటట్లు వ్యాపింపచేయడానికి అయితేనేమి మహానేర్పరులు కదూ! టెలిఫోనూ వైర్లెస్సూకూడా వారికి తీసిపోతాయి! అయితే నేరమునకుమాత్రం ఎప్పుడూ దొరకరు! ఎవళ్లయినా ఏమైనా అనిపోతారని తామే ముందుజట్టీకి దారితీసి నేరం ఎదుటివారిమీదనే మోపేస్తారు. మొన్నను మనపొరుగు కృష్ణారావు పెళ్లాంమీద ఏమిటి వేసేరో తెలుసునా? అది పట్టపగలే మగనిచేత కాళ్లు పట్టించుకుంటుందనీ, విసిరించుకుంటుందని బుకార్లు వేసేరు! అంతేకాకుండా దాన్ని చూసినప్పుడల్లా వీళ్లు ఏదోమిషమీద 'మొగుడిచేత కాళ్లు పట్టించుకొనేవాళ్లు' అని మాటల సందర్భములో చీటికిమాటికి దొర్లిస్తూ ఉండడము ఒకళ్లనుచూచి ఒకళ్లు నవ్వుకుంటూ ఉండడమూ, యీమోస్తరుగా చేస్తున్నారు. చూసిచూసి కృష్ణారావుపెళ్లాం నాతో యేమన్నదో తెలుసునా? "యమలోకం అన్నది ఉన్నదో లేదో అని అనుమానం అవుసరములేదు; వీళ్లిద్దరూ చనిపోయిన తర్వాత వెళ్లేదే యమలోకం" అని అన్నాది. "ఈలాంటి అత్తగారితోనూ ఆడబొట్టెతోనూ యెలాగు వేగుచున్నావే" అని నాగురించి ఆశ్చర్యపడ్డది. అది మీఅమ్మా అప్పా సంగతే చూసిందిగాని మీసంగతికూడా చూడలేదు. మీముగ్గురిసంగతీ నిదానంగా కనిపెట్టిచూస్తే, నేను పడుతూఉన్న బాధలూ, నామనస్సులోని ఖేదమూ, నేను చూపుతున్న ఓర్మీ ఇవన్నీ కొంచెం గమనిస్తే, ఇది నిజంగా సీతాసావిత్రి అలాంటి అమానుషమైన ఓర్మి, శక్తి గలదిగాని మామూలుది కాదని ఎవరికైనా తోచకమానదు!

'నామీదకూడా ఏమిటా విసుర్లు?'

అననా? అనక మానేస్తానా? మీగురించి కొంచెం ఆగి ఆలోచించుకోండి! అప్పుడు నేనన్నవి నిజమౌనో కాదో బోధపడుతుంది! మీరు ఊరునిండా అప్పులు చేసేస్తున్నారట! నాకు తెలియకపోలేదు! మొన్నను కాఫీహోటేలువాడు రెండుమూడుమార్లు వచ్చేడు; వాడిని మీఅమ్మగారు ఎందుకువచ్చేవని అడిగేరుగాని వాడు మీపరువు నిలబెట్టేడు; ఏదో కేసుపనిఉన్నదని చెప్పి వెళ్లిపోయినాడు. ఇంటి అద్దెబాకీ దీనితో నాలుగునెలలది యివ్వాలిగదా! పనిఉన్న లేక పోయినా ప్రతీప్లీడరుతోపాటు ఇద్దరు గుమాస్తాలు; వాళ్లకు నెలాతిరిగి వచ్చేసరికి పుట్టమీదపెట్టినట్లు జీతాలు యిచ్చుకోక తప్పదుగదా! ఇక బంట్రోతు కాపవాళ్లు, నూనెవాళ్లు, నేతివాళ్లు, పాలవాళ్లు వాళ్ల సంగతి చెప్పఅక్కర్లేదు. ఇలాగు యిన్నిఖర్చులు అవుతూనే ఉంటాయి! నేనుమాత్రం అల్లా పాత చీరెలు మూడింటితోనూ యేడాదినుండీ కాలక్షేపము చేస్తున్నానుగాని కొత్తది కొనడానికి మీకు ఎప్పటి కప్పుడే ఏదో ఒకకొంప మునిగిపోయినంత ఆటంకం, ఇబ్బంది. ఇలాగు అప్పులుఅయిపోతూ, ఖర్చుకు ఎరా మురీగా ఉన్నా మీకు చీమకుట్టినట్లైనా ఉండకుండా, మీరు నావలుపట్టుకొని యిలాగు కాలక్షేపము చేసి వేయడమో—లేకపోతే పేకాటకో, బాతాఖానీకో, ఏమొక్కకనో, పువ్వుకనో, ఏగుమ్మడిపళ్లకో, పనస పళ్లకో, ఏబాలుకనో, టీపార్టీకనో, ఏ ఆటకో, పాటకో, ఏపూరికో, ఎవరిదగ్గిరకో, చెప్పకుండా చెయ్యకుండా పారిపోవడమో—గాని మీకు మీవృత్తిమీద పిసరంతైనా లక్ష్యమువున్నట్లు కనబడదుగదా! ధనతృష్ణ ఉండి దానికి తగినఓపిక లేకపోతే కార్యమేమిటి? చూడండీ మనయింటియెదుట అల్లా మచ్చలప్లీడరు! రైలువచ్చిమాటుమణిగేదాకా పెట్రోలులైటువెలిగించి అలాగు పురుగులకోసం బల్లిలాగు కాచి కూర్చుంటాడు! వీధిలో పార్టీలాంటివాడు ఎవడైనా వెళుతూఉంటే వాడిని పలకరించక మానడుగదా! పట్నాయుడుని చూస్తే బంధువును చూసినట్లే సంతోషం! ఎక్కడ రూపాయిలు చప్పుడైనా యింట్లోంచి పైకివెళ్లిపోవచ్చి నిలబడి తదేకదీక్షతో చూస్తాడు! పార్టీలతో అతి నెమ్మదిగా అతి ఆప్యాయంగా మాట్లాడతాడు! మొన్నను మీగుమాస్తాని అడుగుదురూ! ఎవళ్లో గోచీలుకట్టుకొన్న కూరాకులపార్టీలు మనయింటికి వచ్చేరు; మీరులేరనివిని వెళ్లిపోయినారు. వాళ్లని యీ మచ్చలప్లీడరుగారి గుమాస్తా రమ్మని తీసుకెళితే ప్లీడరుగారు వాళ్లని గుమ్మంలోనే యెదుర్కొని తీసికెళ్లి కుర్చీలమీద కూర్చోపెట్టేడండీ! సర్కసులో కోతులు కుర్చీలమీద కూచుంటే ఎలాగుంటాయో వాళ్లు కుర్చీలమీద కూర్చొని అలాగేఉన్నారు! అలాగుచేస్తే ఏమైనా డబ్బాయేగాణీ దొరుకుతుంది కాని మీలాగు విస్పాటమూ నిర్లక్ష్యమూ ఉంటే ఈవృత్తిలో ఏమిటిలాభము? పోనీయండి! నేను మొదటినుండీ మీకు చెవిలో యిల్లుకట్టుకొని శత పోరేనా లేదా చెప్పండి! ఏదో మేష్టరుపనికిగాని మరేదైనా పనికిగాని చదివీయండి! నెలకు నూరైనా రాకపోవు! దానితో ఎలాగో కాలక్షేపము చేసి వేయవచ్చును. ఈప్లీడరుపనిలాగు వోడుదొడుకులు ఉండవు, నిత్యదరిద్రం ఉండదు, కడుపులో చల్ల కదలకుండా జీతం ముట్టిపోతూ ఉంటుంది, గౌరవంగా కాలక్షేపానికి లోటుండదు, అని నేనంటే, "మాష్టరునీ మంగలాడినీ చూసేవాడెవడు? ఎక్కడికైనా వెళుతూవున్నప్పుడు ఎదురుగుండా వస్తే తిట్లు తినడంతప్ప వాళ్లకు గౌరవమేమిటి? నాపీకపోయినా ప్లీడరీకి చదవక మాన"న్నారు! చదివేసేరు! ఏమిటి లాభం! ఇలాగు ఎలకలలాగు మాడిపోతున్నాము! ఇలాగు మరికొన్నిరోజులుంటే మనము వీధి యెక్క వలసినదే! మీఅమ్మగారిడబ్బూ, అప్పగారిడబ్బూ పాము పడగెత్తికాస్తూఉన్న ధనంలాంటివే! ఆఆశ కలలోనుకూడా లేదుగదా! మీవృత్తిలో రాబడికి

నీతీ నిలకడాలేదు. డబ్బు లావుగాఉన్నట్లేఉంటుంది. ఏమండీ! ఇదంతా మనదేనా అంటే, ఎప్పుడూ స్టాంపులసొమ్మో, పార్టీలసొమ్మో, నకళ్లసొమ్మో అనే చెప్తూఉంటారు. డబ్బు ఉండికూడా దరిద్రం సముద్రం అంతాఉండి దాహానికి ఒకచుక్క కూడా లేనట్లుంది. ఏమైనా రాబడి వస్తుందోరాదో తెలియదు. ఎంతవస్తుందో తెలియదు ఎప్పుడు వస్తుందో తెలియదు. ఈరోజున నాలుగురాళ్లు వచ్చాయని మిన్నందుకుంటే రేపు కాణీఅయినా కళ్లబడదని కూపములో క్రుంగిపోవడమేగదా! ఎందుకీ ఎగుడు దిగుడులబ్రతుకు? నిలకడగా ఎంతో కొంతవస్తే చచ్చీచెడీ దానిలోనేయిమిడి సంసారం పొక్తుచేసుకో వచ్చును. దీనికో! దీనికి అలాగు కాదుగదా! అనవసరమైన వేషభాషలు, డాబుదర్పాలు, పైనిపటారం, లోపల లొటారం! ఏదిలేకపోయినా వేగనట్లుంటుంది ఇవన్నీ ఎలాగో సర్దుకోనేసరికి కాళ్లు పీకిపోతాయి. ఆఖరికి పెళ్లానికి గుడ్డముక్క కొనడానికిగాని పిల్లలికి బడిపుస్తకాలు కొనడానికిగాని ఇబ్బంది పడకుండా రోజులువెళ్లకుండా వున్నవి. పట్టాస్టాంపుకి బదులువాడితే మరి ప్రాక్టీసు యేమిటి? చూడండీ! ఆ సబురిజస్ట్రారులని వస్తారు! అంతచచ్చువాళ్లు మరి ఉండరుగదా! వాళ్లకి ఎంత చేతకానివాడికైనా జీతం కాక రోజుకి పది, పదిహేను రూపాయిలు సునాయాసంగా దొరుకుతాయట! వాడికి దవాలా బంట్రోతు, పెట్టే, బేడా, వేషం, దర్జా అన్నీ ఉంటాయి! కాని ఖర్చు స్వల్పం! ఏవీధికొసనో ఒకమారుమూల యింట్లో ఒకభాగం పుచ్చుకొని రాతికింద కప్పలాగు కాలక్షేపం చేసివేస్తాడు! ఆఖరికి పింఛనీకూడా వస్తుంది! కాలుమీద కాలేసుకొని తినవచ్చును! మీకు అలాగు కాదే! ఆఖరిదాకా అయ్యన్నపంతులులాగు కాళ్లీడ్చుకుంటూ వెళ్లవలసినదేగాని మానేస్తే మానీడమేగాని కాణీఅయినా కళ్లపడదుగదా! కాలాడితేగాని కడవాడనిబ్రతుకు! అంచేత సర్వేశ్వరుడు సమనుపంపించేవరకూ సాగుతూఉండవలసినదే మీ వృత్తిలో! మురారి మూగించడమేగాని తనంతటతాను మానివేయడం ఉండదుగదా! ఇటువంటి మీవృత్తీ మీ రుణాలూ, మీస్థితిగతులూ, అటుపైని యింట్లో

నిత్యకలహములూ ఇవన్నీ అనుభవిస్తూ ఇంకా రానున్నవి తలచుకుంటే నాగుండె చెరువైపోతూ ఉంటుంది! ఏదిఎట్లున్నా మీకు కొంచెమైనా శ్రద్ధ లేకపోవడం బాగుందికాదులెండి! పిల్లలూ, పెళ్లామూ, సంసారమూ వీటియొక్క బాధ్యత మనస్సుకు పట్టించుకోక 'అంటకు ముట్టకు' అన్నట్లు ఎన్నాళ్లేమిటి ఇలాగు తిరగుతారు? ఎన్నాళ్లేమిటి ఇంకా ఈ పేకాటా గోట్టికాయలాటా ఆడేస్తారు! బుర్ర పండిపోవడం మొదలుపెట్టిందికదా మనస్సెప్పుడేమిటి పక్వం అవుతుంది? ఇంకా ఈచిల్లరఆటలూ చిన్నతనమూ కట్టిపెట్టకుండా ఉంటే, ఎప్పుడేమిటి దీక్షగా డబ్బుఆర్జించి నిలవచేస్తారు! పిల్లలకు చదువులు వున్నాయి, సంధ్యలు ఉన్నాయి, పెళ్లిళ్లు ఉన్నాయి పేరంటకాలు ఉన్నాయి! "పూటభత్యం, పుల్ల వెలుగూ" అన్నట్లు మీరు కాపురంచేస్తే ఇవన్నీ యెలాగు జరగుతాయి! పోనీ అందుకడిగా డబ్బున్న మామగారేనా ఉంటే వారియింట్లో సకుటుంబంగా కాలక్షేపంచేసేసి దొరికిన నాలుగురాళ్లు మిగిల్చి వడ్డీకి వేసుకుందా మనుకుందుకి అట్టిఅదృష్టము మనమొగాలకి లేదుగదా! మరియేమిటి సాధనం? దొరికిన అయిదారురాళ్లూ జేబులోనే ఉంటాయిగాని పెట్టెలో పెట్టడానికైనా మీకు శ్రద్ధా తీరుబాటూ ఉన్నట్లు కనిపించదు! జేబులోనుంచే అవి కాటు అయిపోవడమో ఖర్చుఅయిపోవడమో జరుగుతుందికాని పెట్టే, తాళమూ ఈఘోషే మీకు అక్కర్లేదుకదా! దీనికితోడు మీకు ఊరినిండా అప్పులు! ఇలాగు మీరు సంసారంచేస్తూఉంటే నామనస్సును అనునిత్యమూ ఆందోళన కొరుక్కుతింటూ ఉంటుందంటే ఆశ్చర్యమేమిటి? అవునుకాని, మీకు వారంవారంవచ్చే పచ్చటి అట్టపుస్తకాలు ఇప్పుడు రాలేదేం? కంపెనీ వాడికి బాకీపెట్టేసేరా? బాగుంది! పేలులాగైనా బాకీలులాగైనా మరి బాధలేదన్నట్లుంది మీసంగతి! ఇవన్నీ యెలాగు తీరుస్తారేమిటి? ప్రొద్దున్నలేచి చెప్తారా? ఆహా! మీకు ఎలాగు నిద్రపడుతుందండీ! నాకు కళ్లుమూస్తే అప్పులవాళ్లందరూ యిల్లు చుట్టివేసినట్లుంటుందికదా! దీనినుండి ఎప్పుడేమిటి విముక్తి?